"మీరు నమ్ముతున్నారా?" సంశయాత్మకంగా అడిగింది సీత. అలా అడగడంలో ఆమె గొంతు సన్నగా వణికింది. అది నమ్మతగ్గ విషయమేనా అన్న విస్మయం, నిజంగా అలా జరిగిందా అన్న నిర్వేదం, అలా ఎందుకు జరిగింది అన్న దుఃఖం, అది నిజం కాదేమో అన్న ఆశ ఆ కంఠంలో ధ్వనించాయి.

దూకుడు పిల్లలా విసురుగా వీచిన గాలికి కిటికీ తలుపులు గోడకి కొట్టుకుని, తప్పు దొరికితే చాలు అపహాస్యం చేసే సమాజంలా పెద్ద శబ్దం చేశాయి. తప్పు చేసిన బిడ్డలను చూడడానికి ముఖం చెల్లని తండ్రిలా సూర్యుడు మబ్బుల మాటున చేరాడు. ఎలాంటివారైనా తన బిడ్డల్ని అక్కున చేర్చుకుని, వారి తప్పుల్ని కడుపులో దాచుకునే తల్లిలా భూమాత తన బిడ్డల యోగక్షేమాల్ని పర్యావలోకించడానికి తన చుట్టూ తాను తిరగడం దాదాపుగా సగం పూర్తయింది. ముఖం చెల్లకపోయినా, మమకారం చంపుకోలేని తండ్రిలా సూర్యు డప్పుడప్పుడు మబ్బుల మాటునుండి తొంగిచూస్తూనే ఉన్నాడు. సాంబ్రాణి పరిమళంతో ఇల్లంతా గుప్పుమంటూంది.

"నిజంగా మీరు నమ్ముతున్నారా?" తలంటుకొని, కిటికీ దగ్గర కూర్చుని కురు లారబెట్టుకుంటున్న సీత అన్న గారిని మరొకమారు అడిగింది. కొద్దిగా తల ఎత్తినా, ఆమె చూపులు ఆవిడ మీద నిలవలేమన్నట్టుగా బెదిరి పక్కకు తప్పుకున్నాయి. పాతి కేళ్ళ క్రితం సౌభాగ్యాన్ని పోగొట్టుకున్న అమ్మకు అయిదేళ్ళ కూతు రుందంటే తనే కాదు, అమ్మ సంగతి తెలిసిన ఎవరూ నమ్మలేరు.

"తనంతట తాను అలా చెప్పుకుంటూంటే నమ్మక ఏం చేస్తాం? మీరు అమెరికా వెళ్ళిన తరవాత నేను మీ అమ్మను నాతో బాటు ఉండమని అడగడానికి వెళ్ళాను. అప్పు డక్కడ చూసిన అమ్మాయిని గురించి అడిగితే ఈ సంగతి చెప్పి తాను రానని, ఈ విషయం మూలంగా నిన్ను అన్యాయం చెయ్యవద్దని కోరింది" అన్నారు కమలమ్మగారు.

"అమ్మ చాలా అమాయకురాలత్తయ్యా."

"సుశీల నాకు తెలియదా ఏమిటే! చిన్నప్పటి నుంచి ఒకరి నొకరు ఎరుగుదుం. అమాయకురాలు, మంచిది కాబట్టే తన బిడ్డ కోసం గుండెల మీద కుంపటి లాంటి కళంకాన్ని మోస్తూంది. తాను ఎండలో కాగుతూ, తన బిడ్డకు గొడుగు పడుతూంది. తాను కాలుతూ ఆ పిల్లకు వెలుగు చూపిస్తూంది. అదే ఇంకొకరైతే రెండో కంటివాడికి తెలియకుండా ఏ అనాథాశ్రమంలోనో విడిచి తమ బ్రతుకు తాము బ్రతికేవారు. అయినా, కడుపుతీపి అంటే అదేనేమోనే, సీతా! తన బిడ్డల భవిష్యత్తు కోసం తన జీవితాన్నే పణంగా పెట్టడం స్త్రీకే చెల్లింది."

ఆ మాటలు విన్న సీత ముఖం వెలవెలబోయింది.

"అందరూ అలా ఉంటే ఈ లోకంలో తల్లితండ్రు లుండీ అనాథలుగా పెరిగే దురదృష్టవంతులు ఎందుకుంటారు?" అంది నెమ్మదిగా.

"అది వారి స్వార్థం మీద, అవసరం మీద, పరిస్థితుల మీద ఆధారపడి ఉంటుంది. సమాజపు కట్టుబాట్లు అనే ఉచ్చులో తమ జీవితం చిక్కుకుని నందన వనం కావలసిన జీవితం ఎడారిలా అయిపోతుందేమో అని భయపడే వయసులో, స్త్రీకి బిడ్డపై అనురాగం కన్నా, జీవితానికి చుక్కాని లాంటి పురుషుడు, అతని ప్రేమ ముఖ్యంగా కనిపిస్తాయి. కన్నె ఈ పనికి ఒడిగట్టవచ్చు. కాని, జీవిత చరమాంకంలో ప్రవేశించిన స్త్రీ తనకు సంఘంలో గౌరవం కన్నా తన బిడ్డ శ్రేయస్సు, ప్రేమ, అభివృద్ధి ముఖ్యంగా భావించవచ్చు. ఆ వయసులో స్త్రీకి ప్రవాహానికి ఎదురీదగల ధైర్యమూ, సాహసమూ వస్తాయి."


"కాని, ఆ వయసులో స్త్రీ తప్పు చేయడం అరుదు కదా!"

"మామూలు పరిస్థితుల్లో అది అరుదు. కాని, ఒకసారి భర్త అనురాగాన్ని చవిచూచిన స్త్రీ దురదృష్టవశాత్తు ఏ కారణం చేతనైనా దాన్ని కోల్పోతే పదేపదే ఆ అనుభవాన్ని తలుచుకుంటూ కాలం గడుపుతూ ఉంటుంది. ఆ పరిస్థితుల్లో ఏదైనా అనుకూలిస్తే ఇలాంటిది జరగవచ్చు. అందులో ఒంటరిగా ఉన్న స్త్రీ అయితే మరింత అవకాశం ఎక్కువ."

"అత్తయ్యా! మీరు అమ్మను క్షమిస్తున్నారా? లేక ఈ వయసులో ఈ పని. . ."

"అది వ్యక్తిగతమైన బలహీనత. నాకు ఒకడే కొడుకు. నేను ఒంటరిగా ఇన్నేళ్ళు గడపడానికి ఎంత శ్రమ పడ్డానో, ఎన్ని పరీక్షలకి తట్టుకున్నానో ఆ భగవంతుడికి తెలియాలి. నిజం చెపితే మీరు నమ్మరు. ఒంటరితనం ఎంత భయంకరమైనదో నాకు అనుభవం మీద తెలుసునమ్మా. అందుకే పుణ్యం కొద్దీ పురుషుడు, దానం కొద్దీ బిడ్డలు అన్నారు పెద్దలు. ఈ రెండు స్త్రీకి ముఖ్యం. దానిలో మనం ఏ లోపం చెయ్యకూడదు." కిటికీలోంచి బయటకు చూస్తున్న సీత వంక చూస్తూ అన్నా రావిడ.


దూరంగా వినపడుతున్న బాంఢు వాద్యం చేరువ అవుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. వారికి సుపరిచితమైన వాద్యం అది. తల్లిప్రేమక






# అమ్మ మనసు

వి. మోహన్‌కుమార్




ఆ కుర్రాడు ఆమె వైపు తదేకంగా చూస్తూ నిలిచిపోయాడు. ఆ చూపుల్లో కృతజ్ఞత, గౌరవం మేళవించి ఉన్నాయి. ఆ కళ్ళు ఆనందంతో మెరిశాయి. ఆ అమాయకమైన కళ్ళలో నీళ్ళు నిండి బుగ్గలపై జారాయి.

"ఏమిటి ఆలోచిస్తున్నావు?"

"మీ పిల్లలు అదృష్టవంతులు. వచ్చే జన్మలోనైనా మీ కడుపున జన్మించే అదృష్టం కలిగించండమ్మా." అతను వంగి ఆమె పాదాలను స్పృశించాడు.

"లే, బాబూ. ఏమిటిది?" సీత సంకోచంగా వెనక్కి జరిగింది.

అతను లేచి కళ్ళు తుడుచుకుని, "వస్తానమ్మా" అంటూ బయటకు వెళ్ళి బాండు వాయించుకుంటూ వేచి ఉన్న ఆ గుంపులో కలిసిపోయాడు.

"ఎంత ఇచ్చావు, సీతా?"

"వంద రూపాయలు. పోయిన జన్మలో ఎంత పుణ్యం చేసుకున్నానో దేవత లాంటి మిమ్మల్ని, దైవం లాంటి మీ అబ్బాయిని పొందగలిగాను. కాని, దానమే చెయ్య లేను. దానిని ఈ జన్మలోనైనా చెయ్య నియ్యండి." అత్తగారికి సమాధానం చెప్పింది.

"నీ ఇష్టం నే నెప్పుడు కాదన్నాను? మనం ఈ రోజు ఇంకొకరి బిడ్డకు ఏ సహాయం చేస్తామో, అదే సహాయం రేపు మన బిడ్డలకు ఇంకొకరు చేసి వారి అభివృద్ధికి తోడ్పడతారు." ఆ మాటలు విన్న సీత కళ్ళలో నీళ్ళు నిలిచాయి. వెంటనే ముఖం అత్తగారికి కనిపించనీయకుండా గదిలోకి వెళ్ళి కిటికీ దగ్గర నిలబడింది.

'పుణ్యం కొద్దీ పురుషుడు, దానం కొద్దీ బిడ్డలు అన్నారు. మనం ఈ రోజు ఇంకొకరి బిడ్డకు ఏ సహాయం చేస్తామో, అదే సహాయం రేపు మన బిడ్డలకు ఇంకొకరు చేసి వారి అభివృద్ధికి తోడ్పడతారు.' అత్తయ్య మాటలు మననం చేసుకుంటూ నిట్టూర్చింది సీత. ఆమె చూపులు ఆ బాండు వాయించుకుంటూ ఇంటింటికీ వెళ్ళి విరాళాలు అడుక్కుంటున్న అనాథ బాలుర గుంపు మీద నిలిచి ఉన్నాయి. కాకీ చొక్కాలు, నిక్కర్లతో పది, పన్నెండేళ్ళ ఆ పిల్లల్ని చూసిన సీత కళ్ళలో నీళ్ళు నిలిచాయి.

"సీతా!" అత్తగారి పిలుపు వినిపించడంలో ఆలోచనల ముసురులోంచి తేరుకున్న సీత కొంగుతో కన్నీరు తుడుచుకొని వెనక్కి తిరిగింది. కిటికీదగ్గర నించుని ఆ బాలుర్ని చూస్తూ కన్నీరు నింపుకున్న కోడలి స్థితి చూసిన కమలమ్మగారు 'నా సీత మనస్సు నవనీతం లాంటిది. భగవంతుని దయవల్ల దీని కడుపు పండి ఒక కాయ కాస్తే ఎంత బాగుండును' అనుకున్నారు.

"సీతా, కాసిని మంచినీళ్ళు అందుకో." లోపల్నుంచి మధు కేక వినిపించడంతో మంచినీళ్ళు తీసుకుని గదిలోకి వెళ్ళింది సీత. "ఏమి టా అవతారం?" హేళనగా అన్నాడు మధు.

"మీరు మళ్ళీ పెళ్ళి చేసుకోండి."

"తప్పకుండా. నువ్వు ఒప్పుకుంటే" ఆశించని సమాధానం విని నిరుత్తరురాలైన ఆమె వైపు చూస్తూ, "ఎప్పుడో తెలుసా? ఆగస్టు పదిహేడవ తారీఖున. అంటే మన పెళ్ళై ఆ రోజుతో ఆరు సంవత్సరాలు పూర్తవుతాయి. నీకు మళ్ళీ పెళ్ళి పీటలమీద కూర్చోవాలని ఉంటే అభ్యంతరం లేదు. మళ్ళీ ఒకసారి జరిపిద్దాం" అన్నాడు నవ్వుతూ.

"ఎగతాళి కాదు. సీరియస్‌గా అడుగుతున్నాను. మన కిక పిల్లలు పుట్టరు. దానికి మీరుకూడా ఎందుకు బాధపడాలి? నేను మనస్ఫూర్తిగా అడుగుతున్నాను. మీరు మళ్ళీ పెళ్ళి చేసుకోండి. వంశాన్ని నిలబెట్టండి. అత్తయ్య ముచ్చట తీర్చండి."

"అమ్మ ఏమన్నా అందా?"

"ఆవిడను పల్లెత్తు మాటంటే, ఆ పాపానికి నేను జన్మ జన్మలకి గొడ్రాలిగా మిగిలిపోతాను. అంతటి ఉత్తమురాలు ఆవిడ."

"సరే. మరి నీ సంగతి?"

"మీరు అవునంటే ఇక్కడే ఉండి మీకు,మీ పిల్లలకి సేవచేస్తూ ఉంటాను. లేకపోతే మా అమ్మ దగ్గరకు వెళ్ళి మా చెల్లిని, అమ్మను చూసుకుంటూ జీవితం వెళ్ళబుచ్చుతాను."

"ఓహో! ఇంకేం, తెలుగు సినిమాకి కథ రాసేయి. డైలాగులు బాగా చెబుతున్నావుగా! సీతా, నీ కెన్నిసార్లు చెప్పాను ఇటువంటి పిచ్చి ఆలోచనలు పెట్టుకోవద్దని? నేను ఈ జన్మలో ప్రేమించేది ఒకే ఒక అమ్మాయిని. ఆ అమ్మాయి సీత. మనకిక అసలే పిల్లలు పుట్టరని ఎందుకు అనుకోవాలి? అయినా, నీ కంత పిల్లలపట్ల మమకారం ఉంటే చెప్పు, ఎవర్నైనా పెంచుకుందాం. పిల్లలు లేనివాళ్ళు ఎవర్నైనా పెంచుకుంటే వారికి పిల్లలు కలుగుతారని శాస్త్రం. చూడు, సీతా! ఈ లోకంలో ఎందరో అభాగ్యులున్నారు. మాతృప్రేమకోసం అలమటించే దురదృష్టవంతు లున్నారు. వారిని ప్రేమించు. పుణ్యము, పురుషార్థము ఉంటుంది. సామాన్యులు కన్నీటితో చీర కొంగులు, జేబురుమాళ్ళు తడుపుకొంటే, ధీరోదాత్తులు ఆ కన్నీటి కడలిలోంచి ఆణిముత్యాల్ని వెలికి తీసి లోకానికి వెలుగు చూపే వేగుచుక్కలౌతారు."

"ఎవర్ని పెంచుకుంటాం? ఎప్పటికప్పుడు వాళ్ళు కలిసినప్పుడల్లా ఎక్కడ తీసుకెళ్ళిపోతారో అన్న భయంతో మనం, కడుపు తీపి చంపుకోలేక వాళ్ళు, కన్న తల్లి తండ్రులపై మమకారంతో పిల్లలు అందరూ బాధపడే కంటే ఎవరూ లేని ఎవర్నైనా పెంచుకోవడం మంచిది."

"అంటే?"

"నా కో ఆలోచన వస్తోంది. ఏ అనాథ శరణాలయం నుండేనా మనకు నచ్చిన ఒకర్ని తెచ్చి పెంచుకుందాం. అప్పుడు ఆ బాధ ఉండదు. దిక్కులేని వారికి ఆశ్రయం ఇచ్చిన పుణ్యం ఉంటుంది. ఆ బిడ్డ కూడా మననే తల్లితండ్రులుగా భావించడం జరుగుతుంది." "అమ్మకు చెప్పావా?"

"లేదు. అత్తయ్య ఒప్పుకుంటారనే నా నమ్మకం. మీరు ఏమంటారో అడిగి చూద్దామని చెప్పలేదు. ఏమండీ! మా ఊరులో ఒక అనాథ శరణాలయం ఉంది. దానిలో నా స్నేహితురాలు పని చేస్తోంది. అక్కడి నుండి తెచ్చుకుందాం. ఏమంటారు?"

"సరే, వెడదాం. ఈలోగా అమ్మకు చెపుదాం."

* * *

"సునందా, అమ్మకు ఎలా ఉంది? రైలు దిగి ఇంటికెళ్ళగానే అమ్మకు గుండెపోటని, హాస్పిటల్లో చేర్చినట్టు తెలిసింది. వెంటనే వచ్చాను." అప్పుడే ఫీమేల్ మెడికల్ వార్డులో అడుగు పెట్టిన సీత నర్సుతో మాట్లాడుతున్న సునందను అడిగింది.

"కోమాలో ఉంది. నిన్న రాత్రి గుండెనొప్పి ఉందని కబురు పెడితే వెళ్ళి చూశాను. కొంతసేపు విశ్రాంతిగా పడుకోబెట్టడానికి ప్రయత్నించాను. కాని, ఆమె విపరీతంగా బాధపడుతోంటే భయపడి ఆస్పత్రిలో చేర్పించాను. ఇంకో రెండు గంటల్లో స్పృహ రావచ్చునని డాక్టరు చెప్పారు. రా, చూద్దువుగాని. ఆయన రాలేదా?"

"వచ్చారు. ఆయన స్నేహితుడు హార్టు స్పెషలిస్టు ఒకాయన ఇక్కడ ఉన్నారట. తీసుకురావడానికి వెళ్ళారు. సునందా, ని న్నిక్కడ చూశాక నా మనసు స్థిమితపడింది. అమ్మను ఎవరు చూస్తున్నారా అని నాలో నేను ఎంతో మథనపడ్డాను. సునందా! నీ ఋణం ఎలా తీర్చుకోగలమో తెలియదు. కన్న కూతుర్ని నేను అమ్మకు అడుగడుగునా

